

# ప్రజాసేవ

"ప్రియమైన విద్యార్థులారా!

ఈరోజు మన పాఠశాలకు నిజంగా శుభదినం. గత వారం రోజులుగా మన పాఠశాలలో విద్యావారోత్సవాలు జరుపు కుంటున్నాం. ఈ సందర్భంగా ఈవారం రోజులలో మనం ఎన్నో కార్యక్రమాలు చేపట్టాం. ఎన్నో పోటీలు పెట్టుకున్నాం. వ్యాసరచన, వక్తృత్వం, క్విజ్. పద్యపఠనం, విద్య అందరికీ అందుబాటులోనికి రావాలంటే ఏం చేయాలి? అనే వివిధ అంశాల మీద చర్చలు సాగించాలి. ఆయా పోటీలలో విజేతలకు ఈరోజు బహుమతులు కూడా ఇవ్వదలిచాం. బహుమతి ప్రదానానికి మన శాసన సభ్యులు ఎరకయ్యగారిని పిలవగానే ఆయన సంతోషంగా అంగీకరిం చినందుకు ముందుగా ఆయనకు ధన్యవాదాలు చెపుతున్నాను. విద్యార్థుల పేర్లు పిలవగానే వరుసగా ఒకరి తరువాత ఒకరు వచ్చి, బహుమతు లందుకుని ఎరకయ్యగారికి ధన్యవాదాలు తెలియ చెయ్యవలసిన దిగా తెలియచేస్తున్నాను" అని ప్రధానోపాధ్యాయులు ముగించగానే విద్యార్థులంతా చప్పట్లు కొట్టారు.

ఆ తరువాత పాఠశాల తెలుగు మాస్టారు విజేతల పేర్లు చదవగానే విద్యార్థులు వరుసల్లో వెళ్లి బహుమతులను అందుకుంటున్నారు. ఎమ్మెల్యేగారు బహుమతులిస్తూ వాళ్ళతో కరచాలనం చెయ్యటమో, కాస్త ముచ్చటగా ఉన్నవాళ్ళ బుగ్గలు స్పృశించడమో చేసారు.

బహుమతి ప్రదానం ముగిసింది.

ప్రధానోపాధ్యాయులు వినయంతో కాకర పాదులాగా వంకర్లు తిరుగుతూ "అయ్యా! విద్యార్థులకు రెండు మాటలు చెప్తారా!" అన్నారు. ఎమ్మెల్యే ఎకరయ్యగారు ముఖంనిండా సంతోషాన్ని పులుముకుని 'తప్పకుండా' అని లేచి నిల్చున్నారు.

"ప్రియమైన సిన్నారులారా!

ఈ రోజు నా జీవితంలో మరిసిపోలేను. ఎన్ని వన్లున్నా మీకాడ నేను కూకుండిపోనానంటే, నా మనసులో ఎక్కడో ఉండిపోయిన కోరిక సేతనే. నీనా రోజుల్లో సదువుకుందామని ఎంత ఉబలాటపడినా నా తలిదండ్రులు నన్నెవసాయంలో దింపీసినారు. ఉన్న ఎకరన్నర అప్పులకింద పోయింది. నానా బాదలు పడినాను. ఈనాటికి నా సొంత కష్టం

మీద ఈ స్టేజికొచ్చినాను. నీనెలాగగా సదువుకోలేను. అందుకే మీకందరికీ ఒకటే మాట. మీరందరరూ నదూకోవాలి. మన పెబుత్వం ఇయ్యాల సదూకోసం ఎంతో కర్సు చేస్తుంది. ఎందుకో తెలుసా? మీరంతా నదుకున్నప్పుడే మంచి ఉజ్జోగాలు సెయ్యిగల్రు. మంచి జీతాలు నంపాదించగల్రు. ఉదాహరణకు మీ ఎడ్మాస్టర్ని తీసుకోండి. 'మేస్టారూ? మీకెంత జీతం సెప్పండి?' అన్నాడు ఎమ్మెల్యే.

''వదిహేను వేలు'' వినయంగా జవాబిచ్చారు హెచ్.ఎం.

''నూసారా? మరి డాట్రుగారూ.... ఈనాటి ముఖ్య అతిథి..... మీరు సెప్పండి డాట్రుగారూ మీకెంత జీతవెూ?'' అధ్యక్షస్థానంలో ఉన్న డాక్టరుగార్ని ప్రశ్నించారు.

అయిష్టంగానే జవాబు చెప్పారు డాక్టరుగారు.

"సూసారా? మరి మీరూ సదూకుంటేనే, మంచి ఉజ్జోగాలొస్తాయి. మంచి జీతాలు వస్తాయి. అవునా?" అన్నారు.

"అవును" అన్నారు పిల్లలు కోరస్‌గా.

ముందు వరుసలో ఉన్న విద్యార్థి దేనికీ స్పందిచకుండా కూర్చోటం ఎమ్మెల్యే కంట పడింది.

"ఉరే, అబ్బాయి. ఇలారారా!" అన్నారు ఎమ్మెల్యే.

ఆ కుర్రాడు వేదిక మీదకొచ్చాడు.

"ఏరా, నువ్వు బాగా చదూకుంతావా?" అన్నారు.

"ఊహూ...." అన్నాడు వాడు.

అందరూ ఆశ్చర్యంగా వాణ్ణి చూసారు.

"ఏం?"

''మరేవెూ మా హెచ్.ఎం.గారెంతో చదువు కున్నారు. త్వరలో రిటైరైపోతారు. ఇంకా పదిహేను వేలే జీతం. డాట్రుగారూ అంతే. మరి మీరేవెూ ఏమీ చదూకోలేదు. ఎమ్మెల్యే అయిపోయారు. మీక్కారుంది మిమ్మల్ని అందరూ గౌరవిస్తారు. అందుకే నేను చదూకోను. ఎమ్మెల్యేనయి ప్రజాసేవ చేస్తాను" అన్నాను" అన్నాడు.

ఆ విద్యార్థి సమాధానంతో అంతవరకూ వెన్నెల కాంతులతో వెలిగిన వేదిక కరెంటు పోయినట్లయింది.

కథా నిలయం
శ్రీకాకుళం